క్లుప్తంగా

పీవీ సేవలు మరువలేనివి

ఆదిలాబాద్‌రూరల్: దివంగత నేత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మావల మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పీవీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మావల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, నలిమెల నవీన్‌రెడ్డి, సురేశ్, నాగరాజు, రంజిత్, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

బజార్‌హత్నూర్: అన్నిరకాల ఎరువులను సహకార సంఘంలో అందుబాటులో ఉంచామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేకల వెంకన్న యాదవ్ అన్నారు. శుక్రవా రం మండల కేంద్రంలో ప్యాక్స్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఈవో నారాయణగౌడ్, వైస్ చైర్మన్ వామన్‌రెడ్డి, చట్ల వినిల్, ఆడే సంతోష్, మేకల లింగన్న, దేవ్‌రావ్, సత్యనారాయణ, అల్లం రాజు, రాధ, ఆశన్న, గోవర్ధన్‌గౌడ్, ముత్తన్న పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పన కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గోవర్ధన్ అన్నారు. శుక్రవారం ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు హాజరైన నిరుద్యోగ యువకులకు ఎంఎస్ఎన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామంలో శుక్రవారం రైతు రుణమాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ రైతులు సంబురాలు జరుపుకున్నారు. గ్రామంలోని చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు, గ్రామ రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో రైతులు సురేశ్, ఇస్తారి, అరవింద్, రామయ్య పాల్గొన్నారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు'

జైనథ్: ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూల్ చేస్తే చర్యలు తప్పవని డీఈవో ప్రణీత హెచ్చరించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని వాగ్దేవి స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పలు రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అమ్మడం చేయరాదన్నారు. తల్లిదండ్రులే బయట నుంచి తీసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు.

బస్సు నడపాలని ఆందోళన

బేల: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేందుకు అదనపు ఆర్టీసీ బస్సు నడపాలని ఆందోళన చేపట్టారు. శుక్రవారం మండలంలోని జూనోని గ్రామంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వాడయి వివేక్ మాట్లాడుతూ చంపెల్లి, చప్రాల, సోన్‌కాస్, సదల్‌పూర్ గ్రామాల నుంచి తమ గ్రామం మీదుగా బేలకు వెళ్లే బస్సు పూర్తిస్థాయిలో ప్రయాణికులతో నిండిపోయి ఉంటుందన్నారు. విద్యార్థులు ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని వాపోయారు. ఏఎస్సై జీవన్ అక్కడికి చేరుకొని ఆందోళనను విరమింపచేశారు.

త్వరలో బస్సు సర్వీస్ ప్రారంభం

బోథ్/నేరడిగొండ: బోథ్ మండల కేంద్రం నుంచి మర్లపెల్లి గ్రామం మీదుగా నిగిని గ్రామం వరకు బస్సును త్వరలోనే ప్రారంభిస్తామని డిపో మేనేజర్ ప్రణీత రెడ్డి అన్నారు. గురువారం సాక్షిలో ప్రచురితమైన 'గ్రామాలకు చేరని పల్లె వెలుగు' కథనానికి స్పందించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వేర్వేరుగా నిర్మల్ డిపో మేనేజర్ ప్రణీతతో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. అలాగే కాంగ్రెస్ నాయకులు డీఎంకు వినతిపత్రం అందజేశారు. ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బస్సు సర్వీస్ ప్రారంభించాలని కోరారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

ఆదిలాబాద్‌రూరల్: నిరుపేద విద్యార్థులకు గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ అన్నారు. బంగారిగూడలో గల బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివిన హమీమా ఫెరోజ్ విద్యార్థిని నీట్‌లో ప్రతిభ కనబరిచారు. శుక్రవారం ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే విద్యార్థినికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అందజేసిన రూ. 50 వేల నగదును అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ పరిధిలో నాలుగు మైనార్టీ గురుకులాలు స్థాపించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సాజిదొద్దీన్, యూనుస్ అక్బానీ, అన్సర్ ఉన్నారు.

తగ్గనున్న దూరభారం

- కొనసాగుతున్న బీటీరోడ్డు పనులు
- చేరువ కానున్న మండల కేంద్రం
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



కొనసాగుతున్న సిరికొండ-ధనోర రోడ్డు పనులు.

సిరికొండ: మండలంలోని రాంపూర్, రాంపూర్ (బి), నిజాంగూడ, ధర్మసాగర్ గ్రామాల ప్రజలు ఒకప్పుడు మండల కేంద్రానికి చేరుకోవాలంటే చిక్‌మాన్ వాగుపై వంతెన లేక, వాగును దాటలేక ఇంద్రవెల్లి మండలంలోని ధనోర మీదుగా ముత్నూర్ నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలి. దాదాపు 30 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. కానీ ఇంద్రవెల్లి మండలంలోని ధనోర గ్రామంలోని ఉట్నూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సిరికొండ మండల కేంద్రం వరకు ఫ్లాడ్ డ్యామేజ్ నిధుల కింద రూ. 9 కోట్లతో సుమారుగా 14 కిలోమీటర్ల బీటీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. పనులు కూడా మొదలయ్యాయి. చిక్‌మాన్ వాగుపై వంతెన నిర్మాణంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మండల కేంద్రానికి చేరుకోవచ్చని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

35 కిలోమీటర్ల ప్రయాణం..

ఇంద్రవెల్లి మండలంలోని రాంపూర్, రాంపూర్ గూడ, నిజాంగూడ, ధర్మసాగర్ గ్రామాలను పరిపాలన సౌలభ్యం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన సిరికొండ మండలంలో విలీనం చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సిరికొండకు చేరుకోవాలంటే సుమారుగా 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. మండల కేంద్రానికి చేరుకోవాలంటే వాగుతో పాటు చిన్నచిన్న వాగులు దాటాల్సి రావడం, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తిరిగి రావాల్సి వచ్చేది. వర్షాకాలంలో మండల కేంద్రంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయేవి. అత్యవసర సమయంలో వాగు దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటేవారు.

మారిన పరిస్థితి..

గిరిజన గ్రామాల ప్రజల కష్టాలను గుర్తించిన ప్రభుత్వాలు గత ఏడాది చిక్‌మాన్ వాగుపై లోలెవెల్ వంతెన నిర్మించడంతో కొంతమేర ఇబ్బందులు తొలగిపోయాయి. కానీ వర్షాకాలం వరదలు రావడంతో రాంపూర్ నుంచి మండల కేంద్రానికి ఉన్న రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయి కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి ఉండేది కాదు. ఈఏడాది ఇంద్రవెల్లి మండలంలోని ధనోరలోని ఉట్నూర్ అర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సిరికొండ మండలం వరకు బీటీ రోడ్డుతో పాటు కల్వర్టులు మంజూరయ్యాయి. పనులు కూడా ప్రారంభమయ్యాయి. రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వస్తే దూరభారం తగ్గుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఇబ్బంది పడ్డాం



గతంలో మా గ్రామం నుంచి మండల కేంద్రానికి చేరుకోవాలంటే వాగులు, వంకలు దాటుతూ.. చాలా ఇబ్బంది పడ్డాం. మండల కేంద్రంలో ఏదైనా పని నిమిత్తం వెళ్తే చుట్టూ తిరిగి వెళ్లే వాళ్లం. ఇప్పుడు మాకు వంతెన, రోడ్డు నిర్మిస్తున్నారు దీంతో మా కష్టాలు దూరం కానున్నాయి. – రవి, రాంపూర్

పని దొరుకుతుంది



నేను మాక్స్ వాహనం నడుపుతూ.. జీవనం కొనసాగిస్తాను. మండలంలో ఎవరైనా వాహనం కోసం పిలిస్తే.. మండల కేంద్రానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో చాలా వరకు గిరాకీ దూరం అయ్యేది. ఇప్పుడు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో ఉపాధి దొరుకుతుంది. – అన్‌బులే బలిరాం, రాంపూర్

బాలికలను ఉన్నతంగా చదివించాలి



మాట్లాడుతున్న యశోద

ఆదిలాబాద్‌టౌన్: బాలకలను ఉన్నతంగా చదివించాలని మహిళ సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్‌లో అంగన్‌వాడీ టీచర్లకు బేటీ బచావో.. బేటి పడావో పథకంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ఆడపిల్లలపై వివక్ష చూపవద్దన్నారు. మగ, ఆడ పిల్లలను ఒకేవిధంగా చూడాలన్నారు. సంకల్ప హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ వుమెన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పీడీఎస్‌టీ, సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, గృహ హింస చట్టం, మహిళ సాధికారత తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కృష్ణవేణి, కోటేశ్వర, నిలేశ్వర్, నీరజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల స్థానాల్లో గెస్ట్ లెక్చరర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత తెలిపారు. ఇంగ్లీష్‌లో 1, ఉర్దూ 1, ఉర్దూ ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1, కామర్స్ 1, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్‌సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జూలై 2లోపు దరఖాస్తు చేసుకోవాలని, 3న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సైన్స్ డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో గెస్ట్ లెక్చరర్‌లను భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇంగ్లీష్, ఉర్దూ, జువాలజీలో ఒకటి చొప్పున, కంప్యూటర్ అండ్ సైన్స్ సబ్జెక్టుల్లో 2 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో గెస్ట్ లెక్చరర్లను భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అండ్ సైన్స్ అప్లికేషన్, గణితం, ఫిజిక్స్, బాటనీ, జువాలజీలో ఒక్కొక్కటి చొప్పున, కామర్స్‌లో 2 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై 2లోగా ఆదిలాబాద్ పట్టణంలోని సైన్స్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

ఎదులాపురం: ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకులతో కలిసి జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్‌కి వినతి పత్రం అందజేశారు. ఏఎన్ఎంలకు ఎంసీఏహెచ్ కిట్, ఐడీ నంబర్లు ఇవ్వాలని కోరారు. సంబంధిత ఏజెన్సీ వారు బ్యాంక్ అకౌంట్‌లో కాకుండా ఫోన్ పే ద్వారా జీతం చెల్లిస్తున్నారని, ఈపీఎఫ్, ఈఎస్ఐలలో దాదాపు రూ.2 వేల వరకు వ్యత్యాసం వస్తోందని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వ్యాక్సిన్ కొరియర్ డబ్బులు కూడా చెల్లించాల్సి ఉందని విన్నవించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, ఏఎన్ఎంలు కవిత, విద్య, సుజాత, సునంద పాల్గొన్నారు.

గుట్కా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో గుట్కా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణానికి చెందిన వ్యక్తి అస్లమ్ ట్రేడర్స్ ముజీబ్ ఖాన్ నుంచి గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భుక్తాపూర్‌కు చెందిన ముజీబ్ ఖాన్ కూలర్‌లో గుట్కా ఉంచి సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. ఆయన వద్ద నుంచి రూ.7390 విలువ గల గుట్కా స్వాధీనం చేసుకున్నారు.

దాడులు జరగకుండా చూడాలి

ఎదులాపురం: ఆర్ఎంపీలపై టీఎంసీల దాడులు సరికాదని, దాడులు జరగకుండా చూడాలని తెలంగాణ ఆర్ఎంపీ అసోసియేషన్ జిల్లా నాయకులు శుక్రవారం జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాచారి మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగానే తాము ప్రాథమిక వైద్య సేవలు నిర్వహిస్తున్నామని, ఆర్ఎంపీలకు సంఘం తరఫున అవగాహన కార్యక్రమాన్ని సైతం నిర్వహిస్తున్నట్లు విన్నవించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్, రమేశ్, మోహన్, విశ్వనాథ్, బిక్కు, అశోక్, ఉమేష్, రమణ పాల్గొన్నారు.

నేడు సమావేశం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఈఎస్ సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో రైతుభరోసా, రైతుబంధు పథకాలపై సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండల ప్రత్యేకాధికారి జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. సంఘం సభ్యులు సకాలంలో హాజ రు కావాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీపై అవిశ్వాస తీర్మానం పెట్టిన నేపథ్యంలో బల్దియా రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అవిశ్వాసాన్ని ఎలాగైన నెగ్గాలనే పట్టుదలతో ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లకు అధికార పార్టీ నేతలు ఝలక్ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు కైలాసనగర్ కౌన్సిలర్ అర్చన భర్త రామ్‌కుమార్, 10వ వార్డు రాంనగర్ కౌన్సిలర్ సుజాత భర్త భూమన్న శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ చేరారు.

జిల్లా కేంద్రానికి చేరుకున్న పండరీ యాత్రికులు

ఆదిలాబాద్: బేల మండల కేంద్రం నుంచి పండరీపూర్ పాదయాత్రగా వెళ్లనున్న పలువురు భక్తులు శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పండరీపూర్‌కు భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. పండరీపూర్ శ్రీవిఠల– రుక్మాబాయి ఆలయంలో దర్శనానికి రానున్న ఏకాదశి రోజు చేరుకుంటామని భక్తులు తెలిపారు.

సన్మానం

బోథ్: సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు పదోన్నతి పొంది బదిలీపై వచ్చిన 14మంది ఉపాధ్యాయులను మహాత్మా జ్యోతిబా పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న శుక్రవారం శాలువాతో సత్కరించారు. గ్రామంలోని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సభ్యులు రమణ, సుభాష్ సూర్య, ప్రధానోపాధ్యాయులు సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 11గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పరామర్శ

ఎదులాపురం: గోదావరిఖని కార్పొరేటర్ పెద్దెల్లి ప్రకాష్ మాతృమూర్తి పెద్దెల్లి మధునమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. శుక్రవారం జిల్లాకు చెందిన దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ పరామర్శించారు. మధునమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వర్షం కురవాలని పూజలు



నంది బుగ్గ వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో వర్షం కోసం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం గ్రామస్తులు కాలినడకన బేల మండలం భాది గ్రామ సమీపంలోని నంది బుగ్గ (చెలిమె) వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న నందీశ్వరుడి ఆలయంలో నీళ్లతో అభిషేకం గావించారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి వర్షాలు సమృద్ధిగా కురువాలని మొక్కుకున్నారు. అనంతరం అక్కడి నుంచి గ్రామానికి కాలినడకన వచ్చి గ్రామదేవతకు నీటితో అభిషేకం చేశారు. పెద్ద ఎత్తు న డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు.

వారసంతల వేలం



ప్రకాష్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

తాంసి: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారసంతకు శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రాథోడ్ సంతోష్ రూ.1.51 లక్షలకు వారసంత దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీవో సుమేర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి సాయినంద, లింబాజీ, రవీందర్, పురుషోత్తం పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రతీ శనివారం మండల కేంద్రంలో నిర్వహించే వారసంత వేలంను శుక్రవారం నేరడిగొండ గ్రామపంచాయతీలో నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా.. అత్యధి కంగా పట్టెపు ప్రకాష్ రూ.3లక్షల 61వేల పాడి దక్కించుకున్నారు. దీంతో ఆయనను ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్‌లు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూలై 1న వారసంత వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.50 వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. సంతను దక్కించుకున్న వారు మొత్తం వేలంలో సగాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 15లోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు సకాలంలో వేలంలో పాల్గొనాలని కోరారు.

పేదలకు అండగా 'కల్యాణలక్ష్మి'



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్: పేదలకు అండగా ఉండేందుకే బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని అమలు చేశారని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరూ చెక్కులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. 86 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఎంపీపీ కేంద్రే జ్ఞాను, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, వైస్ ఎంపీపీ భరత్, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ మహ్మద్‌హై పాల్గొన్నారు.

నేరడిగొండ: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన నడికుంట అనిల్ ఇటీవల మృతిచెందగా.. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన భార్య సమతకు ఆర్థిక సాయం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

2న మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఇంటర్వ్యూ

ఎదులాపురం: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 పోస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. టీఎస్ మెడికల్ బోర్డు ద్వారా ఎంబీబీఎస్ రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూలై 2న డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహిస్తున్న వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేను పరామర్శించిన సుగుణ

ఉట్నూర్‌రూరల్: చొప్పదండి ఎమ్మెల్యే మెడిపల్లి సత్యంను కాంగ్రెస్ జిల్లా నాయకురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. ఇటీవల సత్యం భార్య రూపాదేవి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో సుగుణ పరామర్శించారు. రూపాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు.

పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడిని కలిసిన భాషా పండితులు

ఎదులాపురం: ఇటీవల పదోన్నతులు పొందిన జిల్లాకు చెందిన పలువురు భాషా పండితులు శుక్రవారం పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డిని మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. భాషా పండితులు, పీఈటీల ప్రమోషన్లకు సంబంధించి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భాషా పండితులు గిరిధర్, విజయ్, మోహన్ రావు, ఆశన్న, రమేశ్, విట్టల్, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

ఇచ్చోడ: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరో గ్య కేంద్రానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని బీఎస్పీ పార్లమెంట్ నాయకులు మెస్రం జంగుబాపు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లే రోడ్డును పరిశీలించారు. అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మించాలని కోరారు.

సేవ చేసేందుకు ముందుకు రావాలి

ఇంద్రవెల్లి: స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సేవ కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు ఆర్యన్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు టైగర్ గ్రూప్ ఆధ్వర్యంలో పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగలన్నారు. కార్యక్రమంలో టైగర్ గ్రూప్ సంస్థ జిల్లా అధ్యక్షుడు జాదవ్ గోపాల్, మండల అధ్యక్షుడు గావండే గజానంద్, సభ్యులు అజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆదిలాబాద్: పట్టణంలోని భుక్తాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ వెనుకంటి ప్రకాశ్, పాశం రాఘవేంద్ర, అజయ్, రమణ, శ్రీనివాస్, మాదాస్తు సంతోష్, కోవా రవి పాల్గొన్నారు.

మహాలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేత

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం లబ్ధిదారులకు పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్‌తో కలిసి ప్రొసీడింగ్ అందజేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



నిల్వ నీటిని పారబోయిస్తున్న అధికారి



నీటి నిల్వను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పంచాయతీ సిబ్బంది ద్వారా పారబోయించారు. డ్రైడే సందర్భంగా ప్రతీ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాఘువ, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామాన్ని ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డితో కలిసి సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న పరిశుభ్రత పనులను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో సుమేర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శి వెంకట్, లక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలోని మెన్‌రోడ్డు నుంచి శివాజీచౌక్ వరకు మురికి కాల్వల నుంచి జేసీబీ ద్వారా చెత్తను తొలగించారు. తొలగించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు. పారిశుధ్య పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

జైనథ్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు నైనత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. రోడ్లపై గుంతల్లో, టైర్లు, మురికి కాల్వలు, ఖాళీ పాత్రల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

జవానుకు ఘన నివాళి

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో శుక్రవారం ఎస్సై రాధిక వీర జవాను బిజేందర్ కుమార్ శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఇంద్రశేఖర్, తేజ్‌రావు, గుండవార్ సంజయ్, బోనిగిరివార్ గణేశ్, జవాను కుటుంబసభ్యులు రాధేశ్యాం, రజనీ పాల్గొన్నారు.